
సాక్షి ఒడిశా

శుక్రవారం । 14 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,40,852లు, బంగారం 500 మిల్లీగ్రాములు, వెండి 84.55 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గుప్తేశ్వర్‌లో దర్శన టికెట్ రద్దు చేయాలి

-IIలో▸



నకిలీ గుట్కా కర్మాగారాలపై దాడులు

-IIలో▸

అడుగడుగునా తిలోదకాలు!

- బహనాగా బజార్ రైలు ప్రమాదంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు
- ఘటన అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై విస్మయం
- ఒడిశా సీఎస్, రైల్వేబోర్డు ఛైర్మన్‌కు నోటీసులు జారీ

NATIONAL HUMAN RIGHTS COMMISSION



సుప్రీంకోర్టు న్యాయవాది రాధాకాంత త్రిపాఠి

భువనేశ్వర్: బాలేశ్వర్ జిల్లా బహనాగా బజార్ రైలు దుర్ఘటనకు సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రైల్వేబోర్డు ఛైర్మన్‌కు హక్కుల సంఘం నుంచి ఈ మేరకు నోటీసులు అందాయి. జూన్ 2న జరిగిన ట్రిపుల్ రైలు దుర్ఘటనకు సంబంధించి తదనంతర కార్యాచరణ సమగ్ర నివేదిక దాఖలు చేయాలని ఈ ఇరువురు అధికారులను ఆదేశించింది. దీనికి గాను 4 వారాల గడువు మంజూరు చేసింది. సుప్రీంకోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత్ త్రిపాఠి ఎన్‌హెచ్‌ఆర్‌సీలో దాఖలు చేసిన పిటిషన్‌పై కమిషన్ స్పందించింది. బహనాగా బజార్ ట్రిపుల్ రైలు దుర్ఘటన ప్రమాద బాధితుల హక్కులకు భంగం వాటిల్లిందని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఇరుకైన స్థలం ప్రభావంతో దయనీయ పరిస్థితి తాండవించిందని, దుర్ఘటన తర్వాత దొంగతనాలు, మృతదేహాలను భద్రపరచడం, పరిహారం కోసం నకిలీ బంధువర్గాలు తెరపైకి రావడం వంటి విచారకర పరిస్థితులు ప్రత్యక్షంగా తారసపడ్డాయని పేర్కొన్నారు. ఈ విచారకర పరిస్థితులకు రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని పిటిషనర్ అభ్యర్థించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..

రాధాకాంత్ త్రిపాఠి మంగళవారం దాఖలు చేసిన అప్పీల్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీలో గురువారం విచారణ జరిగింది. రైలు ప్రమాదం జరిగి నెల రోజులు దాటినా 42మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. ప్రమాదానికి గురైన మరికొందరు ప్రయాణికుల ఆచూకీ కోసం పలువురు బంధుమిత్రులు ఇప్పటికీ గాలిస్తున్నారని తెలిపారు. ఆత్మీయుల ఆచూకీ అంతుచిక్కక తల్లడిల్లుతున్నారని విస్మయం వ్యక్తంచేశారు. కంటైనర్లలో భద్రపరిచిన మృతదేహాలను గుర్తించేందుకు కుటుంబీకులు తదితర వర్గాలు ఇంతవరకు ముందుకు రాని అమానవీయ ఘటన అత్యంత విచారకరమని కమిషన్‌కు వివరించారు. ప్రమాద స్థలం బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ నుంచి భువనేశ్వర్ ఆస్పత్రులకు మృతదేహాలను తీసుకొచ్చే క్రమంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని తెలియజేశారు. తగిన సౌకర్యాలు లేకపోవడంతో ప్రాథమిక దశలో మృతదేహాలను సరిగ్గా భద్రపరచలేదని ఆరోపించారు. మరోవైపు రైలు దుర్ఘటన ప్రభావంతో పలువురు బాధితులు శాశ్వతంగా ఉపాధి ఆర్జించే శారీరక పటుత్వం కోల్పోయాయరని, వీరు భవిష్యత్‌లో పని చేసే స్థితిలో లేరన్నారు. బాధితులకు తగిన న్యాయం చేయాలని విన్నవించారు. మృతులు, క్షతగాత్రులకు నష్టపరిహారం అందించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని రాధాకాంత కమిషనుకు అభ్యర్థించారు.

న్యూస్‌రీల్

విన్నపాలు.. విన్నారు

- కాశీనగర్ స్టేషన్‌లో రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు



ఎమ్మెల్యే నారాయణరావుకు రైల్వేబోర్డు లేఖను అందిస్తున్న డీఆర్‌ఎం రింకేష్ రాయ్

పర్లాకిమిడి: రూర్కెలా నుంచి పర్లాకిమిడి, గుణుపురం వరకు రోజూ రాకపోకలు చేస్తున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ ఇకపై కాశీనగర్ స్టేషన్‌లో నిలుపుదల చేయనున్నట్టు ఖుర్దారోడ్ డివిజన్ డీఆర్‌ఎం రింకేష్ రాయ్ వెల్లడించారు. ఈ మేరకు భువనేశ్వర్ లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయానికి ఈనెల 11న ఆదేశాలు జారీచేశారు. చాలా ఏళ్లుగా కాశీనగర్ వాసులు రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్, డీఆర్‌ఎం తదితరులకు వినతులు సమర్పించగా, స్పందించిన రైల్వేబోర్డు సానుకూలంగా స్పందించింది. మరో 5రోజుల్లో ఈ సదుపాయం అందుబాటులోకి రానుండగా, రాకపోకల సమయంలో రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు 2నిమిషాలు నిలుపుదల చేయనున్నట్లు సమాచారం.

తాబేళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లతో నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ రస్మిరంజన్ తన సిబ్బందితో కలిసి తాబేళ్ల అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి బైక్‌పై తాబేళ్లను రవాణా చేస్తున్న వాహనంపై బుధవారం రాత్రి దాడి చేశారు. వారి వద్ద ఉన్న బస్తాను తనిఖీ చేయగా 17 ఉభయచరాలు బయటపడ్డాయి. దీంతో ఇరువురినీ అరెస్ట్ చేశారు. నిందితులు కలిమెల సమితి ఎంవీ-43 గ్రామానికి చెందిన వివేక్ మండాశ్(35), హరిలాల్(32)గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి, గురువారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు. నిందితుల నుంచి బైక్, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బైక్ దొంగ అరెస్ట్



బైక్‌తో నిందితుడు బవురి

రాయగడ: బైక్ చోరీ కేసులో నిందితుడిని పద్మపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గుణుపూర్‌లోని బవురి వీధిలో నివసిస్తున్న శంకర్ బవురిగా పోలీసులు గుర్తించారు. ఈనెల 8న తన బైక్ అపహరణకు గురైందని పద్మపూర్‌కు చెందిన గదాధర్ పాణిగ్రహి(టుకులి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా బైక్ గుణుపూర్‌లో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం అక్కడకు వెళ్లి, బవురిని అరెస్ట్ చేశారు. అతని నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

డీఎల్‌సీగా ప్రసన్నకుమార్



రాయగడ: డివిజనల్ కార్మికశాఖ కమిషనర్‌గా ప్రసన్నకుమార్ పాణిగ్రహి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన కొరాపుట్ జిల్లా జయపురంలో కార్మికశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తుండేవారు. 2020నుంచి జిల్లాలో డీఎల్‌సీ పోస్టు ఖాళీగా ఉండటంతో జిల్లా కార్మికశాఖ అధికారి జాస్మిన్ సాహు అదనపు బాధ్యతలతో కార్యకలాపాలను నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం డీఎల్‌సీగా పాణిగ్రహి బాధ్యతలు చేపట్టడంతో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు, పేమెంట ఆఫ్ గ్రాట్యూటీ తదితర సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రాస్పత్రికి 'మో హాస్పిటల్' నిధులు



కేంద్రాస్పత్రిలోని ప్రసూతి, శిశు సంరక్షణ విభాగం



అధికారులకు సూచనలందిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి 'మో హాస్పిటల్'పథకం కింద సుమారు రూ.3 కోట్లను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ గురువారం జిల్లా ఆస్పత్రిలోని డెలివరీ, శిశు సంరక్షణ విభాగాలను గురువారం సందర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులుతో ఆస్పత్రిలో మరుగుదొడ్లు, అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజావైద్య విభాగం అధికారి డాక్టర్ ముబారక్ అలీని ఆదేశించారు. పరిశీలనలో సీడీఎంఓ లాలామోహన్ రౌత్రాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలాడలో వన మహోత్సవం

పర్లాకిమిడి:

వన మహోత్సవంలో భాగంగా గుసాని బ్లాక్ ఉప్పలాడ గ్రామంలోని ఆర్ఐ కార్యాలయం ప్రాంగణంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ గురువారం మొక్క నాటి, 'మో గోఛా అభియాన్'ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, తహసీల్దార్ నారాయణ బెహరా, ఆర్ఎంసీఎస్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

నిలిచిన రాకపోకలు



మాలిగుడ వద్ద ప్రవహిస్తున్న వరదనీరు

కొరాపుట్: కొరాపుట్-రాయగడ జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం వేకువజామున కొరాపుట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసాయి. దీంతో లెండ్రి మాలిగుడ వద్ద పిల్ల కాలువ పొంగిపార్లింది. గత ఆగస్టులో ఈ వంతెన కూలిపోగా, అధికారుల పక్కనే తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలు నిలిచిపోయాయి.

నాగుపాము కలకలం



సర్పాన్ని బంధిస్తున్న సేనాపతి

రాయగడ: పట్టణంలోని ఇందిరానగర్ మొదటి లైన్‌లో గురువారం ఉదయం నాగుపాము కలకలం సృష్టించింది. కాలనీలోని ఓ ఇంట్లోకి పాము ప్రవేశించడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు బయటకు పరుగులు తీశారు. దీనిపై స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రదీప్ సేనాపతికి సమాచారం అందించారు. ఈ మేరకు అక్కడికి చేరుకున్న ఆయన.. దాదాపు 7 అడుగుల సర్పాన్ని చాకచక్యంగా బంధించారు. అనంతరం సమీపంలోని అడవుల్లో విడిచి పెట్టారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

విజిలెన్స్ వలలో ఏఎస్‌ఐ

భువనేశ్వర్: స్థానిక సాహిద్ నగర్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ మమత బస్తియా రాష్ట్ర విజిలెన్స్ వలలో చిక్కుకున్నారు. ఓ బాధితురాలి నుంచి లంచం తీసుకుంటుండగా అక్కడికక్కడే పట్టుకున్నారు. ఓ కేసు విచారణ అధికారిగా ఉన్న ఆమె.. ఫిర్యాదుదారుకు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.15వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలి విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. పట్టుబడిన సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకొని, ఏఎస్‌ఐని అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సంబంధించిన 2 ఇళ్లపై వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. అవినీతి నిరోధక(సవరణ) చట్టం-2018 కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతూన్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

- కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆదేశం



సమావేశంలో పాల్గొన్న బీడీఓలు, తహసీల్దార్లు

బరంపురం: జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన ట్రస్ట్ బోర్డ్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోపాల్‌పూర్ పోర్ట్ ట్రస్ట్, ఐఆర్‌ఈ ట్రస్ట్ తోపాటు వివిధ ట్రస్ట్‌ల నుంచి వచ్చిన నిధులతో జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రధానంగా ప్రజలకు మౌలిక సౌకర్యాలైన తాగునీరు, మురుగుదొడ్లు, రహదారుల నిర్మాణం వంటి చేపట్టాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని, ఆదాయ వనరులుగా మార్చేందుకు యోచించలని కోరారు. సమావేశంలో పీడీ కీర్తి వాసన్, బరంపురం సబ్ కలెక్టర్ అశితోష్ కులకర్ణి, బీడీఓ, అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో ఆడి కృత్తిక



పూజల్లో పాల్గొన్న భక్తులు

పట్టణంలోని కస్తూరీనగర్‌లో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో వచ్చే కృత్తికా నక్షత్రం రోజు నిర్వహించే ఆడి కృత్తిక పర్వదినం సందర్భంగా స్వామివారిని పాలు, పెరుగు, తేనె, విభూతితో అభిషేకించారు. ఆలయ ప్రధాన అర్చకులు పలఖండం రఘునాయక శర్మ, మావుడు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలకు పెద్ద సంఖ్యల భక్తులు హాజరయ్యారు.

రాయగడ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

నెలాఖరులో రాష్ట్రపతి పర్యటన



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల చివరి వారంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఒడిశాకు రానున్నట్లు అనుబంధ వర్గాలు గురువారం తెలిపాయి. గత ఏడాది జూలైలో అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత ఆమె స్వరాష్ట్రానికి రావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఈదఫా పర్యటన పురస్కరించుకుని 26న జరగనున్న ఒడిశా హైకోర్టు 75వ వార్షికోత్సవ వేడుకలు, కటక్ నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా(ఎన్‌ఎల్‌యూఓ) స్నాతకోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరా కానున్నారు. అదే రోజు ఎస్‌సీబీ మెడికల్ కళాశాల విద్యార్థి సంఘం వార్షికోత్సవంలో కూడా పాల్గొనున్నారు. దీనికి సంబంధించి రాష్ట్రపతి భవన్, కేంద్ర హోంశాఖ సంబంధిత కళాశాల అధికారులకు సమాచారం అందించారు. ఈనెల 27న భద్రక్ సందర్శించి అటానమస్ కళాశాల వజ్రోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ ఏడాది మేలో రాష్ట్రపతి అత్తమామల గ్రామమైన పహడ్‌పూర్ సందర్శించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో ఆమె బరిపద మహారాజా శ్రీరామచంద్ర భంజదేవ్(ఎంఎస్‌పీసీబీ) విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో కూడా పాల్గొన్నారు.

రైల్వేలో కొత్త హాల్టుల ప్రయోగం

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వేలో ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ దిశలో పలు ప్రయాణికుల రైళ్లను కొత్తగా మరిన్ని స్టేషన్లలో నిలిపేందుకు రైల్వేశాఖ నిర్ణయించింది. అయితే ఇది నామమాత్రంగా కొనసాగుతుంది. ఈ ప్రయత్నం ప్రయోజనాల ఆధారంగా తదుపరి నిర్ణయం ప్రకటిస్తారు. ఇదో ప్రయోగాత్మక ప్రక్రియ అని, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఈ సదుపాయం నిరవధికంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. 18423/18424 భువనేశ్వర్-నయాగడ్ టౌన్-భువనేశ్వర్ సేవా ఎక్స్‌ప్రెస్ ఈనెల 15నుంచి లింగరాజ్ టెంపుల్ రోడ్ స్టేషన్‌లో ఆగుతుంది. భువనేశ్వర్ నుంచి బయలుదేరే 17015 అప్ భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్లలో ప్రయోగాత్మకంగా హాల్టు కల్పించారు. అలాగే ఈనెల 5నుంచి ఈ రైలు మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో తాత్కాలిక హాల్టు సౌకర్యం కల్పించారు. దీనితో పాటు పూరీ నుంచి బయలుదేరే 17479 అప్ పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో, విశాఖపట్నం నుంచి బయలుదేరే 12861 విశాఖపట్నం-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ మధిర స్టేషన్‌లో తాత్కాలిక సౌకర్యంగా నిలుపుతున్నట్లు రైల్వేశాఖ వెల్లడించింది.

• సిద్ధాశ్రమంలో వన మహోత్సవం



రస్మిరంజన్ సిద్ధాశ్రమం ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. నవరంగ్‌పూర్ జిల్లా తారాగం రోడ్డులో ఆశ్రమ కార్యకర్తలు మొక్కలు నాటారు. అగ్నిపూర్ పంచాయతీ తిర్లి అంబగుడ నుంచి పిలిక వరకు, తెలిగుడ నుంచి డెప్పిగుడ వరకు 50 రావి, అశ్వద్ధామ మొక్కలు నాటగా, రెండు రోజుల క్రితమే గుంతలు తవ్వి, సేంద్రియ ఎరువులు వేశారు. గత 24 ఏళ్లుగా రస్మిరంజన్ సిద్ధాశ్రమం గిరిజన ప్రాంతాల్లో వనయజ్ఞం నిర్వహిస్తోంది. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు నీల పాఢి, సతీష్‌కుమార్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

– కొరాపుట్

క్లుప్తంగా

డిమాండ్ల సాధనకు నిరసన



వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సంఘం సభ్యులు

జయపురం: వివిధ డిమాండ్ల సాధనకు ఈనెల 14(నేటి) నుంచి ఈనెల 20వరకు నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేయనునున్నట్లు ఒడిశా గ్రామీణ కృషి కర్మచారి, మహిళా గ్రామీణ కృషి కర్మచారి సంఘం ప్రతినిధులు స్పష్టంచేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు శాంతి యుతంగా ఆందోళన జరుపుతామని తెలిపారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా వ్యవసాయశాఖ అధికారికి గురువారం వినతిపత్రం అందించారు. సంఘం కొరాపుట్ జిల్లా శాఖ అధ్యక్షుడు సత్యభామ నాయక్, కార్యదర్శి జామి అనీల్‌కుమార్ మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్లు ఈ నెలాఖరులోగా పరిష్కరించకపోతే ఆగస్టు 1నుంచి సామూహిక సెలవులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సభ్యులు వనిత ప్రధాన్, రస్మిత పండా, జయలత మాఝి, కుంతి మాఝి, సుశాంతకుమార్ మిశ్రా, సుభాష్ ఖొరా, సురేందు కుమార్ దాస్, దుర్గాప్రసాద్ తరాసియ, శశికల సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో దేవదాయ శాఖ జేవీఓ



దుర్గాభవానీకి జ్ఞాపికను అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యురాలు అనూరాధ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దేవదాయ శాఖ రీజనల్ కార్యాలయ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ) అల్లు వెంకట దుర్గా భవాని గురువారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ..ఆదిత్యుని జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కృష్ణమాచార్యులు, బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శాప్ హ్యాండ్‌బాల్ అకాడమీలో బాలుర ప్రవేశాల కోసం తెనాలిలోని మినీ స్టేడియంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి ఎంపికలు జరగనున్నాయని డీఎస్ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14 నుంచి 18 ఏళ్ల వయసు కలిగి, రాష్ట్ర/జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి/ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు అర్హులని స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, శారీరక ధృఢ సామర్థ్య పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఐదు పాస్‌ఫొటోలతో ఈనెల 17న ఉదయం 8 గంటలకు తెనాలి మినీ స్టేడియం వద్దకు చేరుకోవాలని, పూర్తి వివరాలకు 7842829449 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులతనిఖీ



బోరుభద్ర హైస్కూల్‌లో మెనూ పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు

కోటబొమ్మాళి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కృష్ణకిరణ్, గంజిమాల దేవి గురువారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో పర్యటించారు. బోరుబద్ర ఉన్నత పాఠశాలలో నిబంధనల ప్రకారం జగనన్న గోరుముద్ద పథకం అమలు కాకపోవడాన్ని గుర్తించారు. 397 గుడ్లు అధికంగా నిల్వ ఉండటాన్ని గుర్తించి హెచ్‌ఎం పి.రామకృష్ణకు షోకాజ్ నోటీస్ జారీచేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో సంతబొమ్మాళి తహశీల్దార్ జె.చలమయ్య, కోటబొమ్మాళి సీఎస్‌డీటీ కె.రాము పాల్గొన్నారు.

చిన్నారుల నేరాలపై లోతైన దర్యాప్తు అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల కేసులను విచారణ చేసేటప్పుడు వారు ఎవరి ప్రోద్బలంతో నేరాల బాట పట్టారో గుర్తించి లోతైన దర్యాప్తు చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియ ర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం శ్రీకాకుళం కోర్టు ఆవరణలో పోలీసులు, జువైనల్ జస్టిస్ చట్టంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలనే, చిన్న వయసులోనే నేరాలను కట్టడి చేస్తే సమాజానికి మేలు చేసేవారమవుతామని చెప్పారు. సమావేశంలో న్యాయవాది అన్నెపు భువనేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుప్తేశ్వర్‌లో దర్శన టికెట్ రద్దు చేయాలి

- జయపురం సిటిజన్ కమిటీ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న సిటిజన్ కమిటీ అధ్యక్షుడు దాస్

జయపురం: కొరాపుట్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుప్తేశ్వర్‌ను సందర్శించే భక్తుల నుంచి టిక్కెట్ వసూలు చేయడాన్ని జిల్లాకు చెందిన వివిధ సంస్థలు తప్పు పడుతున్నాయి. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బొయిపరిగుడ యువకులు, జయపురం సిటిజన్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జయపురం సిటిజన్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రావణ మాసంలో వేలాది మంది భోల్‌భం భక్తులు, కావిడిదారులు పవిత్ర జలాలతో మహాశివుని అభిషేకించేందుకు వస్తుంటారని గుర్తుచేశారు. ఒడిశాతో పాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను నుంచి కూడా భక్తులు వస్తుంటారన్నారు. సుదూరం ప్రాంతాల నుంచి కాలి నడకన చేరుకొనే భక్తులు డబ్బులు చెల్లించకపోతే ఆలయం లోపలికి అనుమతించక పోవడం దారుణమని విమర్శించారు. గుప్తేశ్వర్ ఉన్నతికి ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడదంపై మండిపడ్డారు. ఈ ఉత్వర్వులను వెంటను నిలిపివేయాలని కోరుతూ జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌కు వినతిపత్రం అందించారు. సమావేశంలో సిటిజన్ కమిటీ అధ్యక్షుడు మీనకేతన దాస్, ఉపాధ్యక్షుడు మదనమోహణ నాయక్, సలహాదారు డాక్టర్ సురేష్ దాస్, తరుణ భారతి అధ్యక్షుడు డాక్టర్ గంగాధర నందొ, లలిత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

నాగరికమంచ్ నిరసన..

గుప్తేశ్వరుని దర్శించేందుకు వచ్చే భక్తుల నుంచి రూ.10 వేలు టికెట్ వసూలు చేసేందుకు దేవదాయ, ధర్మదాయ అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు, భక్తులు తీవ్రంగా ఖండిస్తున్నారు. వెంటనే అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని బొయిపరిగుడ సచేతన నాగరిక కమిటీ ప్రతినిధులు స్థానిక బీడీఓ అభిమణ్యు కవిశత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఏ దేవాలయంలో దైవ దర్శనానికి టికెట్ వసూలు చేయడం లేదని గుర్తుచేశారు. కేవలం గుప్తేశ్వర్‌లో శివుని దర్శించేందుకు ఎందుకు వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించారు. అత్యధికమంది ఆదివాసీలు నివసించే కొరాపుట్ జిల్లాలో స్థానిక ప్రజలు తమ సంప్రదాయంలో భాగంగా వివిధ సందర్భాల్లో గుప్తేశ్వరుని దర్శనానికి వస్తుంటారని తెలిపారు. ప్రతిసారీ టికెట్ తీసుకోవడం ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని పరిగణలోకి తీసుకొని, టికెట్ వసూలు రద్దు చేయాలని కోరారు.



బీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాగరిక మంచ్ ప్రతినిధులు

కార్యక్రమంలో బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత గుప్తా, నాయకులు కిరు స్వాయి, మహేంద్రకుమార్ దొలాయి, గుప్తేశ్వర సమితి సభ్యులు బిభీషణ హంతాల్, హేమాంతకుమార్ మహాపాత్రొ, జిల్లా పరిషత్ సభ్యుడు రాజేశ్వర మహురియ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గుట్కా కర్మాగారాలపై దాడులు

- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు, తయారీ సామగ్రి



నకిలీ గుట్కా కర్మాగారంలో సీజ్ చేసిన యంత్రం

బరంపురం: జిల్లాలోని దిగపండి ప్రాంతంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న నకిలీ గుట్కా తయారీ కర్మాగారంపై పోలీసులు దాడులు చేపట్టారు. ఇందులో రూ.లక్షల విలువైన నకిలీ గుట్కా, తయారీ సామగ్రి, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం బరంపురం జిల్లా పోలీసు పరిధిలోని లొంగలదేవి గ్రామంలో నకిలీ గుట్కా కర్మాగారంపై దిగపండి పోలీసులు దాడులు నిర్వహించారు. సబంధిత యాజమానితో



మనోజ్‌సాహు



రబీంద్ర గౌడ

సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో యజమానులు మనోజ్ సాహు, రబీంద్ర గౌడా, సిబ్బంది కలియా దొర, రామచంద్ర దాస్, సరోజ్‌కుమార్ బెహరా పోలీసులు గుర్తించారు.

ఇరువురు ఐఐసీల బదిలీ

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ ఐఐసీ సుశాంత కుమార్ సాహు, రాయఘడ బ్లాక్ ఐఐసీ ఆనంద చంద్ర పాత్రొ కంధమాల్ జిల్లాకు బదిలీ చేస్తూ సదరన్ రేంజ్(బరంపురం) ఐజీ సత్యబ్రత భొయి ఉత్వర్యులు గురువారం జారీచేశారు. ఖాళీ అయిన స్థానాల్లో గంజాం జిల్లా జరడా, బరంపురం పెద్ద బజార్ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్ భూపతి, సునీల్‌కుమార్ బెహరా భర్తీ కానున్నారు.

యువకులపై దాడి చేసిన నిందితుల అరెస్ట్

జయపురం: బంధువుల ఇంటికి వచ్చిన ఇరువురు యువకులపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులను జయపురం సదర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు జయపురం సమితి గరుడగుడ గ్రామంలోని గదబ వీధికి చెందిన లక్ష్మణ గదబ(32), జగదీష్ గదబ(34), మాసింగ్ గదబ(30), హరిబంధు గదబ(23), బలరాం గదబ(44), ఓ మైనర్ ఉన్నారని ఐఐసీ ఈశ్వర తండి వెల్లడించారు. ఈ మేరకు వారందరినీ కోర్టులో హాజరు పరిచామన్నారు. గరుడగుడ, గదబగుడ, హరిజన్ వీధి మధ్య చాలాకాలంగా పాతకక్షలు ఉన్నాయి. హరిజన వీధికి చెందిన పద్మన హరిజన్ మేనల్లుడు జమునగుడకు సమీర్ హరిజన్, అతని స్నేహితుడు కుంభారపుట్‌కు చెందిన బాలు హరిజన్ ఈనెల 9న రాత్రి 7గంటల సమయంలో గరుడగుడ గ్రామానికి వచ్చారు. ఇరువురూ సమీపంలోకి చెరువుకు వెళ్లగా, గదబ వీధికి చెందిన ఆరుగురు వ్యక్తులు మారణాయుధాలతో దాడికి దిగారు. సమీర్, బాలులు తీవ్రంగా గాయపడగా, దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచాం ని, దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఐఐసీ వివరించారు.

ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ క్లినిక్ నడిపితే చర్యలు



సేవలపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వరిస్తున్న వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడిపితే చర్యలు తీసుకుంటామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. ప్రతి విభాగాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వ కేంద్రంలోని రికార్డుల్లో సరైన వివరాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ కొంత మంది వైద్య సిబ్బంది బయట ప్రైవేట్ క్లినిక్‌ను నడిపిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వైద్యం కోసం వచ్చిన వారిని సొంత క్లినిక్‌లకు రిఫర్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. రాత్రివేళ వైద్యం కోసం వచ్చిన వారికి సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, వైద్యులు శ్రీరా ములు, మహరాజ్, తేజ్‌ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల

ఆక్రమణలకు విముక్తి

- భూముల స్వాధీనంపై ఆర్డినెన్స్ జారీ
- కోర్టుల్లో వివాదాలకు చెక్ పెట్టేలా తక్షణ చర్యలు
- జిల్లాలో ఆక్రమణల్లో ఉన్న 4683 ఎకరాల స్వాధీనానికి ప్రణాళిక



ఇతరుల స్వాధీనంలో ఉన్న లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ భూములివే..

అరసవల్లి:

దేవదాయ శాఖ ఎట్టకేలకు విప్లవాత్మక చర్యలకు నడుం బిగించింది. దేవాలయాల భూములు చేతులు మారి అన్యాక్రాంతం అవుతున్నా.. చట్టంలో కొన్ని లొసుగులను అడ్డం పెట్టుకుని ఏళ్ల తరబడి వాటిని అనుభవిస్తున్నా...గత ప్రభుత్వాలేవీ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం దేవాలయాల భూములన్నీ తిరిగి ఆలయాలకే చెందేలా..సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలకు దిగింది. ఏడాదిన్నరగా ఇదే అంశంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు సమీక్షలు నిర్వహించి చివరకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేశారు. దీనిని రాష్ట్ర గవర్నర్ కూడా ఆమోదించడంతో ఇప్పుడు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తాజా నిర్ణయంతో ఆక్రమణల్లో ఉన్న లక్షలాది ఎకరాల ఆలయ భూములు తిరిగి టెంపుల్ ప్రాపర్టీగా కొత్త సర్వే నిబంధనల ప్రకారం నమోదు కానున్నాయి. ఈ చర్యలతో జిల్లాలో సుమారు 4683 ఎకరాల ఆలయాల భూములు తిరిగి దేవదాయశాఖకు చెందేలా అడుగులు పడుతున్నాయి.


జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 30 మండలాల్లో 799 దేవాలయాలుండగా.. వీటిలో ఆదాయాల స్థాయిని బట్టి 6ఏ స్థాయి ఆలయాలు–5, 6బీ ఆలయాలు–17, 6సీ ఆలయాలు–7, 6డీ ఆలయాలు (మఠాలు)–701ఉన్నాయి. వీటికి చెందినట్లుగా 13089.57 ఎకరాల ఆలయ భూములున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీటిలో సర్వీసు దారుల వద్ద 4117.75 ఎకరాలు, ఆలయాల సరిహద్దు పరిసరాల్లో 100.51 ఎకరాలు, లీజుల్లో 4115.35 ఎకరాలుండగా.. వివిధ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఆక్రమణల్లో 4683.33 ఎకరాల ఆలయ భూములున్నాయి. తాజా ఆర్డినెన్స్ ప్రకారం ఈ ఆక్రమణల్లో ఉన్న భూములతో పాటు ఎన్నో ఏళ్లగా లీజు కాలం ముగిసినా వారి ఆధీనంలో ఉన్న భూములు కూడా సక్రమంగా తిరిగి ఆయా ఆలయాలకే చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

ఆక్రమణలకు చెక్ పెట్టేలా ఆర్డినెన్స్..

ఆలయాల భూములను నిబంధనల ప్రకారం లీజుకు ఇస్తుంటారు. అయితే ఏళ్ల తరబడి లీజు కాలం ముగిసినా వాటిని విడిచిపెట్టకుండా ఉండేవారి నుంచి భూములను కాపాడుకునేందుకు ఇంతవరకు ఆలయ అధికారులు దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేయడం..ఆక్రమణదారుడు కూడా లాయర్ల ద్వారా వారి వాదనలు వినిపించి, తుది తీర్పు వరకు ఆ భూములను వారి స్వాధీనంలోనే ఉంచేవారు. అలా కాలయాపన జరగడంతో జిల్లాలో సుమారు 644 ఎకరాల భూములకు సంబంధించి జిల్లా కోర్టులో 7 కేసులు, హైకోర్టులో 72 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజా ఆర్డినెన్స్‌తో ఇలాంటి ఇబ్బందులు లేకుండా సదరు ఆక్రమణదారునికి కేవలం వారం రోజుల గడువుతో నోటీసు జారీ చేసి, వెంటనే ఆ భూములను స్వాధీనపరుచుకునే అధికారాలు తాజా ఆర్డినెన్స్ ద్వారా లభించినట్లయింది. చట్టాన్ని ఉల్లంఘించిన ఆక్రమణదారులకు ఎనిమిదేళ్లకు పైగా శిక్ష కూడా పడే అవకాశముంది. ఇన్ని దశాబ్దాల తర్వాత చట్టంలో చేసిన ఈ సవరణల ప్రకారం దేవదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు మార్గం సుగమమైంది.

“ ఆదేశాల ప్రకారం చర్యలు..



ఆలయాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తెచ్చింది. దీనిపై పూర్తి మార్గదర్శక ఆదేశాలు కమిషనర్ కార్యాలయం నుంచి రావాల్సి ఉంది. దీనివల్ల జిల్లాలో వేలాది ఎకరాల భూములు ఆక్రమణలకు విముక్తి కలగనుంది. వారం వ్యవధితో నోటిసు ఇచ్చి భూములు స్వాధీనం చేసుకోనున్నారు. స్వాధీన ప్రక్రియలో అభ్యంతరాలుంటే ఆక్రమణదారుడే కోర్టులకు వెళ్లి .. అవి తమ భూములని నిరూపించుకోవాల్సి వుంటుంది.

– ఎస్.చంద్రశేఖర్, జిల్లా ఎండోమెంట్ అధికారి

టీచర్ ఎడ్యుకేటర్ల నియామకం



కార్యక్రమంలో పాల్గొన్న టీచర్ ఎడ్యుకేటర్లు



ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర పాఠశాలలు–సామూహిక విద్యా విభాగంలో కొత్తగా 104మంది టీచర్ ఎడ్యుకేటర్లను నియమించారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో గురువారం నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీరందరికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేసి, అభినందించారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్ మృతి



బోల్తాపడిన టిప్పర్





ఆస్పత్రిలోచికిత్సపొందుతున్న క్షతగాత్రులు

రాయగడ: జిల్లాలోని టికిరి పోలీస్ స్టేషన్ పరిధి కలియాపొడ ఘాటీ రోడ్డులో బుధవారం రాత్రి టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందగా, అందులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. దీనిపై టికిరి పోలీస్ స్టేషన్ ఐఐసీ బిజయలక్ష్మీ హికాక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టికిరి నుంచి రాయగడకు ఫ్లెయియాస్ లోడ్‌తో వస్తున్న టిప్పర్ కళియాపొడ ఘాటీ వద్ద అదుపుతప్పి, లోయలో పడిపోయింది. ఘటన రాత్ర సమయంలో జరగడంతో ఎవరికీ తెలియలేదు. గురువారం వేకువజామున అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొని, అగ్నిమాక సిబ్బంది సాయంతో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కున డ్రైవర్ మృతదేహాన్ని దాదాపు 2గంటలు శ్రమించి బయటకు తీశారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఉండటంతో చికిత్స నిమిత్తం టికిరి ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుడు, క్షతగాత్రుల వివరాలు తెలియాల్సింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న యువజనోత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



కృష్ణచంద్ర గజపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: స్థానిక పట్టణంలోని కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యువజన సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాలను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కళాశాలకు చెందిన యువతీ, యువకులకు వక్తృత్వం, చిత్రలేఖనం, సాంస్కృతిక నృత్యాలు, ఫొటోగ్రఫీ, పద్యరచన పలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకె(గజపతి) అధికారి అక్షయ నిపానే, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌కుమార్ త్రిపాఠి ముఖ్య భూమిక వ్యవహరించగా, జిల్లా యువ స్వచ్ఛాసేవి ఎ.మహేశ్వరరావు, బి.భవానీప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతలే దారిచూపాలి!

- లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కలాసీ కనకారావు
- వైద్యం చేయించే స్థోమత లేక ఇబ్బందులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



భార్యతో కనకారావు

శ్రీకాకుళం కల్చరల్ : అసలే పేదరికం. దానికి తోడు వెంటాడుతున్న మహమ్మారి వ్యాధి. దీంతో ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నాడు జిల్లా కేంద్రంలోని గూనపాలెంకు చెందిన దేవర కనకారావు. లివర్ క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. పొందురు మండలం కుంకాం గ్రామానికి చెందిన కనకారావే 12 ఏళ్ల క్రితం కలాసీ పని కోసం శ్రీకాకుళం వచ్చాడు. ఇక్కడే నెలకు రూ.4వేలు అద్దె చెల్లిస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈయనకు భార్య లక్ష్మీ, పిల్లలు రాణి, ప్రసాద్ ఉన్నారు. తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటువచ్చాడు. కుమార్తెకు వివాహం చేశాడు. కుమారుడిని ఇంటర్మీడియట్ చదివించాడు. రెండునెలల క్రితం వరకు లివర్ క్యాన్సర్ బారిన పడటంతో ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నాడు. మందులు కొనుక్కునేందుకు కూడా డబ్బులు లేకపోవడం, చికిత్స కోసం ఎక్కువ మొత్తం అవసరం కావడంతో మంచానికే పరిమితమవుతున్నాడు.

ఖర్చు చేసినా..

కనకారావుకు మొదట్లో ఒళ్లునొప్పులు బాధించేవి. ఎందరినో వైద్యులను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో సీటీస్కాన్ చేయించి విశాఖ వద్ద క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ తనిఖీ చేయగా లివర్ క్యాన్సర్ సోకినట్లు తేలింది. ప్రస్తుతం ఫోర్త్ స్టేజీలో ఉంది. ఆపరేషన్‌కు, కిమో చేసేందుకు వీలులేదని, కేవలం మందులు మాత్రమే వాడాలని వైద్యులు సూచించారు. వారం మందులు కొనుగోలుకు రూ.8వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రతి 25 రోజులకు విశాఖ వెళ్లి తనిఖీ చేయించుకుని రూ.10 వేలు విలువైన మందులు కొనుగోలు చేసుకుని వస్తున్నారు. తండ్రి కలాసీ పని ఆగిపోవడంతో కుటుంబాన్ని పోషించేందుకు కుమారుడు ఇంటర్ చదువు మానేశాడు. తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు పనికి వెళ్తున్నాడు.

సాయం చేయదలిస్తే..

కనకారావు దీనస్థితికి స్పందించి దాతలు ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా సాయం చేయాలనుకునేంటే 9177557596 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఖైనీ, గుట్కా కాల్చివేత


ఖైనీ, గుట్కా ప్యాకెట్లు కాల్చుతున్న పోలీసులు

రామభద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ సురేంద్రనాయుడు, వీఆర్వోలు అప్పలనాయుడు, అనిల్ ఆధ్వర్యంలో పోలీసులు సుమారు రూ.లక్ష విలువ చేసే ఖైనీ, గుట్కా పోలీసులు కాల్చివేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమ రవాణా, అక్రమ వ్యాపారుల వద్ద పట్టుబడి పాత కేసులకు సంబంధించిన ఖైనీ, గుట్కా ప్యాకెట్లు కాల్చి ధ్వంసం చేశామని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెంచి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కొత్తవలస: మండలంలోని దెందేరు గ్రామానికి చెందిన జె.నాగరాజు 18 మద్యం సీసాలతో గురువారం పట్టుబడడంతో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఈబీ కొత్తవలస సీఐ సిహెచ్.రాజేశ్వరి తెలిపారు. గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రాజేశ్వరి తమ సిబ్బందితో గ్రామంలో తనిఖీలను నిర్వహించారు. ఇందులో భాగంగా నాగరాజు 18 మద్యం సీసాలు కలిగి వుండడంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8కిలోల గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడ్డ ముద్దాయిలతో ఎస్‌ఐ రవణ


పార్వతీపురం: ఒడిశా రాష్ట్రం బిల్లేష్ గ్రామం నుంచి నాసిక్ తరలిస్తున్న 8కేజీల గంజాయి ప్యాకెట్లను పార్వతీపురం రైల్వే పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు రైల్వే ఎస్‌ఐ ఎల్.రవణ, జీఆర్‌పీ కానిస్టేబుల్ డి.రత్నకుమార్ సూచనల మేరకు తన బృందంతో పార్వతీపురం టౌన్ స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నాలుగు గోధుమ రంగు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం శేషికల్ పోలీసుస్టేషన్ పరిధిలోని బిల్లేసు గ్రామానికి చెందిన కాసి సింహాచలం, దాసి కాశిలను అదుపులోకి తీసుకొని వారి నుంచి 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎన్‌డీపీఎస్‌ఏ చట్టం కింద కేసును నమోదు చేసి విజయనగరం ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవణ తెలిపారు.

అమ్మవారి నిత్యాన్నదానానికి విరాళం


నిత్యన్నదానానికి విరాళం అందజేస్తున్న ఆర్మాన్ విష్ణు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి రూ.లక్షా 16 వేలు విరాళాన్ని అమెరికాకు చెందిన యార్లగడ్డ ఆర్మాన్ విష్ణు అనే భక్తుడు గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి, అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కెఎల్.సుధారాణి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఆడిట్‌తో జవాబుదారీతనం


రాజాంలో మహిళా సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పిస్తున్న ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి

రాజాం: డ్వాక్రా సంఘాల పుస్తకాలు ఆడిట్ చేయడం ద్వారా సంఘంలోని ప్రతి సభ్యునికీ అన్ని విషయాలు తెలుస్తాయని, సంఘాల నిర్వాహకులు జవాబుదారీగా వ్యవహరిస్తారని వైఎస్ఆర్ క్రాంతిపథం రాజాం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి తెలిపారు. మండలంలోని కంచరాం, బొద్దాం, అంతకాపల్లి, తదితర గ్రామాల్లో జరుగుతున్న డ్వాక్రా సంఘాల ఇంటర్నల్ ఆడిట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళా సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించడంతో పాటు ఆడిట్ బృందాలకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏపీఎం టి.దధికుమార్, సీసీలు, సీఎఫ్‌లు, వీఓలు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో సమూల సంస్కరణలు

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు డిగ్రీ విద్యలో సమూల సంస్కరణలు చేపట్టింది. విద్యాభ్యాసం పూర్తయ్యేసరికి స్వయం ఉపాధి పొందేలా విద్యలో సంస్కరణలు తెచ్చింది. ఇందులో భాగంగా నాలుగేళ్ల డిగ్రీని తెచ్చింది.

- ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి..
- మేజర్, మైనర్ సబ్జెక్ట్ కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- మూడింట ఒక్కటే మేజర్ సబ్జెక్ట్‌గా డిగ్రీ
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణత సాధించేలా కోర్సులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం

విజయనగరం అర్బన్: విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక (కరిక్యులమ్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండేది. ఇకపై మేజర్ సబ్జెక్టుతో ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా విద్యా ప్రణాళికను అమలులోకి తీసుకువచ్చారు. కళాశాలల కమిటీలు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఆయా కళాశాలలకు మేజర్, మైనర్ సబ్జెక్టు కేటాయింపులు ఇప్పటికే జరిగిపోయాయి. సంబంధిత జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ నేపథ్యంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఇటీవల ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల అయింది. నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం బుధవారంతో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది.

మూడింట ఒక్కటే మేజర్ సబ్జెక్ట్‌గా..

గతంలో బీఎస్సీలో ఎంపీసీ తీసుకున్న విద్యార్థులకు ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లను తప్పనిసరిగా అభ్యసించాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ మూడు కోర్సుల్లో నుంచి తమకు నచ్చిన ఓ సబ్జెక్టను మేజర్‌గా ఎంపిక చేసుకుంటే చాలు రెండో సెమిస్టర్ దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన ఓ మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్, మార్కెటింగ్.... ఇలా ఇతర ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్ కోర్సుల్లో భాగంగా ఇంటర్మీడియెట్ కోర్సుల ఆధారంగా తమకు నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నారు. డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా మానవ వనరులను తీర్చిదిద్దేంకుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయి. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువరించారు. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు. ఈ రెండు మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్య వరకు అభ్యసించేలా మార్పులు చేశారు.

నాలుగేళ్లకు డిగ్రీ పట్టం

దేశంలోనే తొలిసారిగా నూతన జాతీయ విద్యా విధానం – 2020 మేరకు విద్యా సంస్కరణలను మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ విద్య పూర్తయింది. ప్రస్తుతం మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయింది. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం యూజీ విద్యను రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన వారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆనర్స్ కోర్సులను అందించేందుకు నిబంధనలు విధించారు. మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే ఆనర్స్ కోర్సుల బోధనకు అనుమతి మంజూరు చేస్తారు.

నచ్చిన సబ్జెక్టుపై సమగ్ర అవగాహన



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల్లో మార్పులు తీసుకొచ్చి ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తుంది. సింగిల్ సబ్జెక్టు స్పెషల్ డిగ్రీ విధానం అమల్లోకి వస్తుంది. ఈ నూతన విధానం వల్ల విద్యార్థికి నచ్చిన సబ్జెక్టుపై సమగ్ర అవగాహన పొందవచ్చు. అదే విధంగా ఇతర సబ్జెక్టులపై కూడా పట్టు సాధించవచ్చు. ఈ విషయంపై ఇప్పటికే కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఈ విధానంపై అవగాహన కలిగించాం.

–డాక్టర్ బలగ సుభ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయనగరం

సింగిల్ సబ్జెక్టు డిగ్రీతో ఉపాధి కల్పన



నూతనంగా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలులోకి తెస్తున్న సింగిల్ మేజర్ సబ్జెక్టు డిగ్రీ విధానం వల్ల విద్యార్థికి ఉపాధి కల్పన సులువవుతుంది. ఉదాహరణకు జూవాలజీ మేజర్ సబ్జెక్టుగా తీసుకున్న విద్యార్థికి ఆ సబ్జెక్టుకు సంబంధించి అనుబంధ జీవనోపాధుల అంశాల్లో నిష్ణాతులవుతారు. ఆక్వా ఇండస్ట్రీ, డెయిరీ ఫారమ్స్, పౌల్ట్రీ ఫార్మ్, కుందేలు పెంపకాలు, తేనె తయారీ విధానం, ఇలా అనేక రకాలుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మంచి మార్కుల తెచ్చుకున్న వారికి పీహెచ్‌డీ పరిశోధన డిగ్రీలకు నేరుగా వెళ్లవచ్చు.

–డాక్టర్ ఎస్.రామకృష్ణ, జూవాలజీ అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయనగరం

'జల జీవన్' పనుల పరిశీలన


రాజయ్యపేటలో కుళాయి నీటిని పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సెక్టార్ నిపుణుల బృందం సభ్యులు

తెర్లాం: కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన సెక్టార్ నిపుణుల బృందం గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించింది. ఢిల్లీకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి మిషన్‌కు చెందిన సెక్టార్ నిపుణులు సోమేంద్ర రంజాన్ గంగూలి, సుభాష్‌కుమార్ చౌదరితో కూడిన బృందం సభ్యులు మండలంలోని రాజయ్యపేట, పాములవలస, ఆర్.గదబవలస, కాగాం, వెలగవలస గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో పలు వీధుల్లో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను, వాటి పనితీరును పరిశీలించారు. కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, వాటి పనితీరుపై ఆయా గ్రామాల ప్రజలను, మహిళలను వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్య కమిటీల వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను పరిశీలించారు. కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు జలశక్తి మిషన్ కేంద్రం బృందం సభ్యులు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటి కుళాయిలు సక్రమంగా పని చేయడం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్.రాజన్, డీఈఈ పీఎంకే రెడ్డి, తెర్లాం, బాడంగి ఏఈలు ఎం.శ్రీనివాసరావు, సీహెచ్.ప్రవీణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ ఆర్.రాంబాబుతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు


పశుగ్రామ విత్తనాలను రైతులకు అందజేస్తున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు

కొమరాడ: పాడి పరిశ్రమలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పెంపకంలో పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడి సాధించవచ్చునని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చంద్రంపేట గ్రామంలో పశుగ్రామ వారోత్సవాల్లో భాగంగా రైతులకు గురువారం అవగాహన కల్పించి పశుగ్రాస క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు పాడి పరిశ్రమలో భాగంగా పశుగ్రాసం పెంచుకొనేలా రైతులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధితో పాడి రైతులు జీవితాల్లో మార్పు తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ అధికారి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చక్రధర్, డాక్టర్ జయకిరణ్, స్థానిక పశువైద్యాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిశా మహిళా పోలీసుస్టేషన్ తనిఖీ


దిశా పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: దిశా మహిళా పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపిక గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, రిసెప్షన్ రికార్డులు, సీడీ ఫైల్స్ పరిశీలించారు. మహిళల రక్షణకు, భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన దిశా ఎస్‌వోఎస్ యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను తెలుసుకుని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. దిశా ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐ బి.నాగేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంతకవిటి: మండలంలోని మాధవరాయపురం గ్రామానికి చెందిన గిరడ సింహాచలం(50)కు మూడు నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మందులు వాడుతున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జూలై 1న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు రాజాం ఆస్పత్రికి తరలించగా వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయడంతో అప్పటి నుండి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

12 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్

పాలకొండ: సీతంపేట మండలం మెట్టు హడ్డుబంగి గ్రామానికి చెందిన మహిళ మెడలో పుస్తెలతాడు తెంపిన వ్యక్తిని పోలీసులు 12 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గురువారం వివరించారు. సీతంపేట మండలం మెట్టు హడ్డుబంగిలో వైశ్యరాజు శోభారాణి తన ఇంటి వద్దే చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. పక్క గ్రామం ముకుందాపురానికి చెందిన నిమ్మక వెంకటేష్ బుధవారం ఆ కొట్టు వద్దకు వెళ్లి బిస్కెట్లు కొన్నాడు. ఆమె బిస్కెట్లు ఇచ్చి ఇంటిలోకి వెళ్తుండగా వెనుక నుండి ఆ ఇంటిలోకి చొరబడి ఇటుక బెడ్డతో ఆమె తలపై గట్టిగా మోదాడు. కత్తిని చూపించి ఆమెను భయపెట్టి మెడలో ఉన్న ఆరు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని పారిపోయాడు. ఈ సమయంలో అటువైపుగా వెళ్తున్న వసతిగృహం వంట మనిషి రవణమ్మ పారిపోతున్న వ్యక్తిని గుర్తించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో పాలకొండ సీఐ మురళీధర్ ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. వంట మనిషి ఇచ్చిన ఆధారాలతో వెంకటేష్ ఫోన్‌ను ట్యాపింగ్‌లో పెట్టారు. గురువారం మధ్యాహ్నం వెంకటేష్ శ్రీకాకుళం వెళ్లేందుకు పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉండగా ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా తాను అపహరించిన బంగారు పుస్తెలతాడును పాలకొండ సమీపంలో ఉన్న వెంకటరాయుని కోనేరు సమీపంలో తుప్పల్లో దాచినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు ఆ చెరువు ప్రాంతానికి వెళ్లి పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. సంఘటన జరిగిన 12 గంటలలోపే నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్న సీఐ మురళీధర్, ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. నిందితునిపై 394, 380, 454 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్యానల్ బోర్డును కాల్చేసిన దుండగులు


పాములవలసలో దుండగులు కాల్చేసిన మంచినీటి పథకం మోటార్ ప్యానల్ బోర్డు

తెర్లాం: మండలంలోని పాములవలస గ్రామానికి చెందిన మంచినీటి పథకానికి సంబంధించిన మోటారు ప్యానల్ బోర్డు, విద్యుత్ కనెక్షన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి కాల్చేశారు. దీనికి సంబంధించి గ్రామ సర్పంచ్ చప్ప సుధఈశ్వరరావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మంచినీటి పథకానికి చెందిన విద్యుత్ కనెక్షన్, మోటార్ ప్యానల్ బోర్డును బుధవారం రాత్రి దుండగులు కాల్చేశారని చెప్పారు. దీని ద్వారా సుమారు రూ.10వేల పైనే నష్టం జరిగిందన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా వీధుల్లో వేసిన కుళాయిలను పరిశీలించేందుకు కేంద్ర జలజీవన్ మిషన్ అధికారుల బృందం గురువారం వస్తున్నారని తెలుసుకొని గుర్తు తెలియని వ్యక్తులు మంచినీటి పథకం విద్యుత్ కనెక్షన్, మోటార్ ప్యానల్ బోర్డును కాల్చేశారన్నారు. ఇదే విషయమై సచివాలయ మహిళా పోలీసులకు, మండల ఈవోపీఆర్‌డీ రాంబాబుకు ఫిర్యాదు చేశామని, మహిళా పోలీసు వచ్చి కాలిపోయిన విద్యుత్ కనెక్షన్, మోటార్ ప్యానల్ బోర్డును పరిశీలించారని తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలపై ఫీడ్ బ్యాక్

- రోగి డిశ్చార్జ్ అయిన వారంలోగా ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి
- నాలుగు ప్రశ్నలతో కూడిన వివరాలను ఫీడ్‌బ్యాక్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- ఏప్రిల్ నుంచి జూన్ వరకు 21,260 మందికి సేవలు
- వీటిలో ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ పూర్తి చేసినవి 20,291
- జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 28


విజయనగరం 49వ వార్డు సచివాలయం పరిధిలో ఆరోగ్యశ్రీ లబ్ధిదారుడు నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న ఏఎన్‌ఎం

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు సంజీవని లాంటిది. ఈ పథకం వల్ల ఎంతో మంది పునర్జన్మ పొందారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్క రోగికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు కేన్సర్, గుండె ఆపరేషన్లు, కిడ్నీ మార్పిడి, గుండె మార్పిడి వంటి ఖరీదైన శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేయిస్తోంది. ఏటా లక్షలాది మంది ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు రోగులకు సంతృప్తికరంగా అందుతున్నాయా.. లేదా.. అని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స, శస్త్రచికిత్సలు చేసుకున్న రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తెలుసుకునేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్న ఏఎన్‌ఎంలు

సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు ఆరోగ్యశ్రీ రోగుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. జిల్లాలో 420 మంది వరకు ఏఎన్‌ఎంలు ఉన్నారు. వీరంతా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. ఆరోగ్యశ్రీ రోగులు డిశ్చార్జ్ అయిన వెంటనే వారి వివరాలు సంబంధిత ఏఎన్‌ఎం యాప్‌లోకి వివరాలు వెళ్తాయి. రోగి డిశ్చార్జ్ అయిన వారం రోజుల్లోగా ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఏప్రిల్ నుంచి 21,260 మందికి ఆరోగ్యశ్రీ సేవలు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ నెలఖారు నాటికి జిల్లాలో 21,260 మంది సేవలు పొందారు. వీరిలో ఏఎన్‌ఎంలు ఫీడ్ బ్యాక్ సేకరించి అప్‌లోడ్ చేసినవి 20,791. జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 28 ఉన్నాయి. ఇందులో 18 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు, 10 ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి.

ఫీడ్ బ్యాక్ తీసుకోనున్న అంశాలు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స పొందిన సమయంలో డబ్బులు ఎవరైనా తీసుకున్నారా అని ఏఎన్‌ఎం అడుగుతారు. ఒకవేళ డబ్బులు తీసుకున్నారని ఏ రోగి అయినా చెబితే, వైద్య పరీక్షలకు తీసుకున్నారా, మందులు నిమత్తం తీసుకున్నారా, లేదా లంచం ఎవరైనా తీసుకున్నారా, ఇతర దేనికైనా తీసుకున్నారా అని వివరాలు సేకరించి అప్‌లోడ్ చేస్తారు.

- నెట్‌వర్క్ ఆస్పత్రిలో వైద్య సేవలు బాగా అందిస్తున్నారా..(భోజనం, పారిశుద్ధ్యం, మరుగు దొడ్ల నిర్వాహణ వంటివి) బాగున్నాయా.. లేదా.. అని అడుగుతారు.
- ఆరోగ్యమిత్రల సేవలపై ఆరా తీస్తారు.
- డిశ్చార్జ్ అయిన తర్వాత మందులు ఇచ్చారా.. లేదా.. అని వివరాలు తెలుసుకుంటారు.
- ఈ విషయాలన్నింటిని ఒక నిమిషం పాటు వీడియో తీసి ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

సంతృప్తికర సేవల కోసమే...



ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందిన రోగులకు సంతృప్తికర సేవలను అందించడం కోసం ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటుంది. ఇందుకోసం ఏఎన్‌ఎంలకు ఫీడ్ బ్యాక్ యాప్ ఇచ్చింది. రోగి డిశ్చార్జ్ అయిన వారం రోజుల్లోగా ఏఎన్‌ఎం ఫీడ్ బ్యాక్ తీసుకుని యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తారు. ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో ఉంది.


– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ జిల్లా కో ఆర్డినేటర్

బ్యాంకు లాకర్‌లో బంగారం మాయం

రాజాం సిటీ: రాజాం యూనియన్ బ్యాంకు లాకర్‌లో భద్రపర్చిన బంగారం మాయంపై గురువారం కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు.. స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన కరణం చిట్టినాయుడుకు యూనియన్ బ్యాంకులో లాకర్ ఉంది. ఈ లాకర్‌లో ఈ ఏడాది మార్చి 27న సుమారు 13 తులాల బంగారం భద్రపరిచాడు. అనంతరం కుటుంబంతో సహా సింగపూర్ వెళ్లి ఇటీవల రాజాం తిరిగి వచ్చాడు. ఈ నెల 10న బ్యాంకుకు వెళ్లి లాకర్ తెరిచి చూసి అవాక్కయ్యాడు. ఒక బాక్స్‌లో పెట్టిన లాకర్‌లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు. ఈ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలియజేయడంతో ఎవరో దొంగిలించి ఉంటారని గుర్తించారు. బ్యాంకు సిబ్బంది సూచనలు మేరకు ఆయన చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అయ్యో..!

- చిన్నారి ప్రాణం తీసిన కుటుంబ కలహాలు
- తాటిపెండి వద్ద చిన్నారి మృతదేహం లభ్యం
- భార్య చంపేసిందంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


బాలుడు దినేష్ మృతదేహం

డెంకాడ: కుటుంబ కలహాలు అభంశుభం తెలియని మూడేళ్ల వయస్సున్న చిన్నారి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలంలోని దాకమర్రి పంచాయతీ పరిధిలోని అల్లుపేట గ్రామానికి చెందిన బొట్ట బంగారప్పుడు, అప్పమ్మలకు గణేష్, దినేష్(3) అనే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య చాలా కాలంగా వివాదం నడుస్తోంది. మూడు నెలల పాటు అప్పమ్మ పిల్లలతో కలిసి కన్నవారి ఇంటికి వచ్చేసింది. ఇటీవల గ్రామ పెద్దలు భార్యభర్తల మధ్య సయోధ్య కుదర్చడంతో భర్త వద్దకు అప్పమ్మ వెళ్లింది. భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బుధవారం సాయంత్రం అప్పమ్మ బయటకు వెళ్లిపోయింది. అనంతరం ఆమె కనిపించలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతకసాగారు. ఈ దశలో మోదవలస పెట్రోల్‌బంకు సమీపంలో అప్పమ్మ, పెద్దకుమారుడు గణేష్‌తో గురువారం కనిపించింది. చిన్నకుమారుడు దినేష్ గురించి కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. తోటల్లో వెతికారు. డెంకాడ మండలం మోదవలస పెట్రోల్ బంక్ సమీపంలోని తాటిపెండి వద్ద దినేష్ విగతజీవిగా కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్నకుమారుడిని భార్యే చంపేసిందంటూ భర్త బంగారప్పుడు డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.